సాక్షి
చిత్తూరు
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



బోయకొండ కిటకిట
బోయకొండ భక్తులతో కిక్కిరిసింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు తరలివచ్చారు. - 8లో



గజరాజుల బీభత్సం
పులిచెర్ల మండలంలో ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



ఇసుక..దాచేయ్..దోచేయ్!
చౌడేపల్లి మండలంలో ఇసుక టన్నుల కొద్ది డంపు చేసి సరిహద్దు రాష్ట్రాలకు రవాణా చేసి అక్రమంగా ఆర్జిస్తున్నారు. - 8లో



అక్రమ నిర్మాణం చేపట్టిన దృశ్యం



కొండను తొలిచి వెంచర్‌ని సిద్ధం చేసుకున్న దృశ్యం



అంజేరమ్మ ఆలయం వెనుక ఉన్న కొండను ఆక్రమించుకుంటున్న దృశ్యం

మమ్మల్ని ఆపేదెవడ్రా?

కరిగిపోతున్న కొండలు.. స్వర్ణముఖి

- ఆక్రమణలకు గురవుతున్న భూములు
- మామూళ్ల మత్తులో అధికారులు





తిరుపతి రూరల్ మండలం తనపల్లి మార్గంలోని స్వర్ణముఖి నదిని పూడ్చివేస్తూ నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. అందిన కాడికి అడ్డంగా దోచేస్తున్నారు. మామూళ్లకు అలవాటుపడ్డ అధికారులను బుట్టలో వేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొండలను పిండి చేస్తున్నారు. రాత్రీపగలు తేడాలేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లు పెట్టి మట్టి, గ్రావెల్, ఇసుక, సిలికా, క్వార్ట్జ్‌ను సరిహద్దులు దాటిస్తున్నారు. దగ్గర్లోని వెంచర్లకు తోలుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇది చాలదన్నట్టు ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. అడ్డుచెప్పిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. అధికారులను అడ్డం పెట్టుకుని తప్పుడు రికార్డులు సృష్టించి స్వాధీనం ప్రభుత్వ భూములు చేసుకుంటున్నారు. అటు కుప్పం నుంచి ఇటు గూడూరు వరకు వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

చిత్తూరు కేంద్రంగా భారీగా గ్రానైట్ దందా సాగుతోంది. చిత్తూరు, బంగారుపాళెం, యాదమర్రి, పాలసముద్రం, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు, కుప్పంలో కొండల్లోని గ్రానైట్ సంపదను కొల్లగొడుతున్నారు. చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ పరిధిలోని కుంట్రపాకం సర్వే నం.599 ఎగువ చెరువులోని బంకమట్టిని భారీ యంత్రాలతో తోడి ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులోని నీటిని కూడా ఇటుక బట్టీలకు వాడుకుంటున్నారు. రైతులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బంగారుపాళెంలో

కనుమరుగవుతున్న స్వర్ణముఖి

తిరుపతి రూరల్ మండలం, అవిలాల రెవెన్యూ వేదాంతపురం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిని యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. 2012 నుంచి 2019 వరకు సర్వే నం.504/7 నదీ పోరంబోకు భూమిలో ఇసుకను తోడి విక్రయించి ఆపై పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా స్వర్ణముఖి నది పూర్తిగా కనుమరుగైంది. ప్రస్తుతం ఉన్న కొద్ది పాటి నదిని సైతం పూడ్చివేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కరిగిపోతున్న అంజేరమ్మ కనం..

వడమాలపేట మండల పరిధిలోని అంజేరమ్మ ఆలయానికి ఆనుకుని ఉన్న కొండ కరిగిపోతోంది. ఇప్పటికే ఆలయం వెనుక ఉన్న కొండను యంత్రాలతో తొలిచి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన భూమిని చదునుచేసుకున్నారు. ప్రస్తుతం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సిద్ధం చేశారు. అదే విధంగా ఆలయం వెనుక ఉన్న కొండను తవ్వి గ్రావెల్‌ను తరలించకపోవడంతో పాటు.. ఆక్రమించి మామిడి చెట్లు పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ అక్రమాలు స్థానిక అధికారులకు తెలిసినా మామూళ్లు పుచ్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈనెల 19వ తేదీ వరకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై ప్రచార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 7వ తేదీన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అంశంపై పోటీలు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులకు ఎంపికైన వారికి నేడు చిత్తూరులో అవార్డులు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం ఈనెల 6వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంచార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు పంపిణీ, సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

నేత కార్మికులకు ఉచిత విద్యుత్ జీఓ ఇచ్చి ఆరు నెలలు గడిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పవర్‌లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. ప్రభుత్వం కొలువు దీరి ఏడాదిన్నర కావస్తున్నా విద్యుత్ బాదుడు కొనసాగుతూనే ఉంది. కంటి తుడుపుగా జీఓ ఇచ్చి చేతులు దులుపుకోవడంతో నేతన్నలు మండిపడుతున్నారు. హామీ అమలుకు నేతన్నలు ఆందోళన బాట పడుతున్నారు.



నేతన్నకు ఉత్తుత్తి విద్యుత్

- నేత కార్మికులకు అమలు కాని ఉచిత విద్యుత్
- 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు
- 10,534 పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్లు
- ఉచిత విద్యుత్ హామీ ప్రకటనలకే పరిమితం
- అమలుపై మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం

పుత్తూరు : ఉచిత విద్యుత్ జీఓతో తమ కుటుంబాలకు కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుందనుకున్న నేతన్న జీవితాల్లో నిరాశే మిగిలింది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతిపెద్ద ఉపాధి రంగం. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ రంగం ప్రస్తుతం దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. లయబద్ధంగా వినబడే పవర్‌లూమ్స్ ధ్వని వినిపించడం తగ్గిపోతోంది. ఇందుకు వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలే ప్రధాన కారణం. చాలీచాలని కూలీలతో జీవితాలు అప్పుల పాలవుతున్నాయని నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా దాదాపు అన్ని పవర్‌లూమ్ కేంద్రాలు మూతపడే పరిస్థితిలోకి వెళ్తున్నాయి. గత మార్చి 26వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీవో నంబర్ 44 ఆరు నెలలు పూర్తయినా అమలు కాకపోవడంతో నేతన్నలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

నేతన్నల డిమాండ్లు

- జీవో నంబర్ 44ను వెంటనే అమలు చేయాలి
- మొత్తం రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని వర్తింప చేయాలి
- నూలు, సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి
- జీవిత బీమా సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి
- సహకార సంఘాలను బలోపేతం చేయాలి



విద్యుత్ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న మరమగ్గ కార్మికులు (ఫైల్)

నేతన్న నేస్తంతో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతే కాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్స్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో నారా చంద్రబాబు నాయుడు పుత్తూరులో పర్యటించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. గుడ్డిగా నమ్మిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన బాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో పాటు వివిధ సుంకాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచి నేత కార్మికుల నడ్డి విరిచారు.

జీవో అమలులో నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో దిగివచ్చిన బాబు ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 26వ తేదీన జీవో 44ను విడుదల చేసింది. ఇందులోనూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల వాస్తవ సంఖ్య, పవర్‌లూమ్ యూనిట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపిస్తూ జీవో విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నూలు, పట్టు చేనేత కుటుంబాలు 2,79,000 వేల మంది ఉండగా కేవలం 93 వేల మందిగా చూపించారు. అలాగే మరమగ్గాలు 81 వేలు ఉండగా కేవలం 10,534 ఉన్నట్టుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీవోలో స్పష్టం చేశారు. ఇందుకు ఏడాదికి సుమారు రూ.125 కోట్ల ఆర్థిక భారం పడనున్నదని పేర్కొన్నారు. జీవో అమలుకు డిస్కమ్ సంస్థలు ఇంధన శాఖకు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీవో విడుదలై 6 నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో నేటికీ జీవో అమలుకు నోచుకోలేదు.

సిబ్బందిని అడ్డుకొని..

ప్రతినెలా యథావిధిగా పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను అందుకొంటున్న నేతన్నలు తలలు పట్టుకొంటున్నారు. గత సెప్టెంబర్ నెలలో విద్యుత్ ఈఈకి జీఓ అమలు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈనెలలో విద్యుత్ రీడింగ్ తీయడానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని కార్మికులు అడ్డుకొని వెనక్కు పంపారు. ఈ నేపథ్యంలో జీవో అమలుకు వైఎస్సార్‌సీపీ సారథ్యంలో ఆందోళనలకు నేతన్నలు సిద్ధమవుతున్నారు.



విద్యుత్ రీడింగ్ బాయ్‌ని అడ్డుకొన్న కార్మికులు (ఫైల్)

జీవో ఇచ్చారు.. మరిచిపోయారు...



ఉచిత విద్యుత్ పేరిట జీఓ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణం. పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పక్క రాష్ట్రం తమిళనాడులో 15 ఏళ్లుగా ఉచిత విద్యు త్ అమలు చేస్తున్నారు. మార్చి నెలలో జీఓ ఇచ్చి, ఆగస్టులో అమలు చేస్తామని చెప్పి అక్టోబర్ వచ్చినా బిల్లులు చేతికిస్తున్నారు. మా పరిస్థితి అర్థం చేసుకొని ఉచిత విద్యుత్ జీఓను వెంటనే అమలు చేయాలి. – చిన్నప్ప, శీలకారువీధి, పుత్తూరు

నేతన్న నేస్తం అమలు చేయాలి



గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఈ పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందడంతో మా కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఉచిత విద్యుత్‌తో పాటు నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలి. – కృష్ణవేణి, పవర్‌లూమ్ కార్మికురాలు, పుత్తూరు

ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం



ఉచిత విద్యుత్‌పై మార్చిలో జీఓ విడుదల చేసినా ఆగస్టు నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్టోబర్ వచ్చినా విద్యుత్ బిల్లులు యథావిధిగా ఇస్తున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల అధికారులకు వినతి పత్రాలు సమర్పించాం. అయినా ఫలితం శూన్యం. దీంతో విధిలేక అన్ని కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి నేత కార్మికులు సిద్ధమవుతున్నాం. కార్మికులు రోడ్డెక్కక ముందే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన జీఓను అమలు చేయాలని కోరుతున్నాం. – ఆకుల వాసు, అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్, తిరుపతి.

సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్

- విజయవంతంగా బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి



క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి, నాయకులు (ఇన్‌సెట్లో) పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు, నాయకులు



చిత్తూరు కార్పొరేషన్ : సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇంచార్జి విజయానందరెడ్డి విమర్శించారు. ఆదివారం చిత్తూరు నగరంలో నాల్గవ డివిజన్ కట్టమంచిలో కార్పొరేటర్ స్వరూపరాణి, నాయకులు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ డివిజన్‌లోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ.. హామీలను అమలు చేయకుండా బాబు మోసగించారని విమర్శించారు. చంద్రబాబు ప్రజలకు అబద్ధపు హామీలు గుప్పించి ముఖ్యమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు.

16 లక్షల మంది ఉంటే 2.70 లక్షల మందికే..

కూటమి ప్రభుత్వం తాజాగా ఆటో డ్రైవర్‌లను మోసగించిందని విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల పథకానికి 13 లక్షల మంది ఉంటే కేవలం 2.90 లక్షల మందికి ఇచ్చి పండగ చేసుకోమని చెప్పడం మోసం చేసినట్టేనని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఏటా రూ.15 వేలు చొప్పున 16 లక్షల మందికి అందజేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది ఆటో డ్రైవర్ల పథకం ఎగ్గొట్టారన్నారు. కట్టమంచి నుంచి సాంబయ్యకండ్రిగ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రోడ్డు అలినేషన్ ఆర్అండ్‌బీకి మార్పు చేసేలా ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాబు మోసాల నుంచి మేల్కోవాలి

చంద్రబాబు మోసాల నుంచి ప్రజలు మేల్కోవాలని విజయానందరెడ్డి కోరారు. ఎన్నికల సమయంలో మహిళలకు రూ.18 వేలు, నిరుద్యోగులకు ఏటా రూ.36 వేలు ఇస్తామని ఎగ్గొట్టారన్నారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు జ్ఞాన జగదీష్, హరిణిరెడ్డి, రాహుల్‌రెడ్డి, శివారెడ్డి, మనోజ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మ, నారాయణ, బాబురెడ్డి, సోమురెడ్డి, శేఖర్‌రెడ్డి, అఖిలేష్ తదితరులుపాల్గొన్నారు.

అక్రమ స్కానింగ్ గుట్టురట్టుపై చర్యలేవీ?

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : నాలుగు నెలల క్రితం చిత్తూరు నగరంలో అక్రమ స్కానింగ్ గుట్టురట్టు అయింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ అక్రమ స్కానింగ్ సెంటర్, ముఠాను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసులు సైతం నమోదు చేయించారు. అలాగే చిత్తూరులో పట్టుబడ్డ ముఠా సభ్యులే తిరుపతిలో కూడా అక్రమ స్కానింగ్ నిర్వహిస్తూ..జైలు పాలయ్యారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే పట్టుబడ్డ వారిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నా... వారిపై చర్యలు తీసుకునేందుకు ఆ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నోటీసుల పేరుతో కాలం వెళ్లదీస్తున్నారు. విచారణ అంటూ జాప్యం చేస్తూ వస్తున్నారు. వన్‌టౌన్ పోలీసుల నుంచి కేసు వివరాలు తెప్పించుకుని నెలలు గడుస్తున్నా పట్టుబడ్డ సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. శాఖలో కొందరు అధికారులు చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టుబడ్డ సిబ్బంది శాఖా పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు రూ. 2 లక్షలకు పైగా ఓ అధికారికి ముట్టజెప్పినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

దర్జాగా దోషులు.. నిర్దోషులకు వేధింపులు

కార్వేటినగరం : అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో దోషులను దర్జాగా వదిలేసి, నిర్దోషులను వేధిస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. దళితులపై కక్షగట్టి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితుడిని ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత విగ్రహం నెలకొల్పిన సర్పంచ్ గోవిందయ్యను మాత్రం అరెస్ట్ చేయించిందని విమర్శించారు. ఎలాంటి విచారణ చేయకుండానే ఎలా కస్టడీలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టినప్పటి నుంచి గొడవ చేస్తున్న టీడీపీ నేత సతీష్‌నాయుడుని వదిలిపెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సతీష్‌నాయుడు పలుమార్లు విగ్రహం తొలగించేందుకు యత్నించాడని ఆరోపించారు. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలికితీయాల్సిన పోలీసులు సైతం కూటమి ఎమ్మెల్యేతో కలిసి మాట్లాడడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులను సైతం దోషులుగా నిలబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. విగ్రహానికి నిప్పు పెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో ఉన్నాయని, అయితే పోలీసులు అలాంటివి లేవని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈక్రమంలోనే తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, నిర్దోషికి శిక్ష పడకూడదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి తానే నిప్పు పెట్టానని ఒప్పుకోవాలని ఓ మహిళను బలవంతం చేస్తున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. అభం శుభం తెలియని అమాయకులపై కేసులు పెట్టడం సరికాదని, నిజమైన దోషిని గుర్తించి రాజకీయాలకు అతీతంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, పార్టీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణస్వామి

క్లుప్తంగా

ఉప్పొంగిన గంగ



వ్యవసాయ బోరు నుంచి పొంగుతున్న నీరు

రొంపిచెర్ల : వ్యవసాయ బోరులో నీరు పొంగుతున్న సంఘటన రొంపిచెర్ల మండలం చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. తొప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు మల్‌రెడ్డి రెడ్డి బీస్తపల్లె సమీపంలోని వ్యవసాయ పొలంలో 10 ఏళ్ల క్రితం బోరు వేశారు. అయితే బోరులో ఒకటన్నర ఇంచీల నీరు మాత్రమే వస్తుండడంతో బోరును అలాగే వదిలేశాడు. అయితే 10 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ బోరులో నీరు పొంగి వస్తుండడంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

బంగారుపాళెం : మండలంలో ఓ బాలిక కనిపించడంలేదంటూ ఆదివారం రాత్రి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బంగారుపాళెంలోని ఓ పాఠశాలలో బాలిక 9వ తరగతి చదువుతోందన్నారు. ఉదయం నుంచి కనిపించకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందెంరాయుళ్లు అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పెనుమూరు(కార్వేటినగరం): కోడి పందెంరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండలంలోని ఎద్దలగుట్ట వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటనరసింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎద్దలగుట్ట వద్ద కోడి పందెం నిర్వహిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఇందులో 10 మంది యువకులు కోడిపందెం ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నాలుగు పందెం కోళ్లతోపాటు, వారి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, 10 మందిని అరెస్టు చేశారు. రూ.15,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వరసిద్ధుడి సేవలో సమాచార కమిషనర్



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో కమిషనర్‌కు ఆశీర్వచనాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది వాసు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇంచార్జి వార్డెన్‌ తో నెట్టుకొస్తున్న నగరి ఎస్సీ పోస్ట్ మెట్రిక్ వసతి గృహం



కార్వేటినగరం మండలం కత్తెరపల్లి బీసీ వసతిగృహానికి ఇన్‌చార్జులే దిక్కు

జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ కళాశాల మైదానం ఆవరణలో ఉండే బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో సమస్యలు తాండవిస్తున్నాయి. 150కి పైగా బాలికలు ఉండే ఆ వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్ లేని దుస్థితి. దీంతో ప్రస్తుతం అక్కడున్న వార్డెన్ ఇంచార్జి కావడంతో విద్యార్థుల సమస్యలు అంతగా పట్టించుకోని పరిస్థితి. ఇంచార్జి వార్డెన్‌కు సమస్యలు చెప్పుకోవాలంటే విద్యార్థులు జంకుతున్నారు. ఇంకెవరైనా అధికారులు తనిఖీకి వస్తే చెప్పుకుందామనుకుంటే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటమే లేదు. జిల్లా కేంద్రంలోని ముఖ్యమైన వసతి గృహంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో ఉండే వసతి గృహాల దయనీయ పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడం, ఇంచార్జి వార్డెన్లతో గాడి తప్పుతున్నాయి.

- మొక్కుబడిగా సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ
- గాడి తప్పిన వసతిగృహాల నిర్వహణ
- సంక్షేమ వసతి గృహాలవైపు కన్నెత్తి చూడని అధికారులు
- వసతి గృహాల్లో వేధిస్తున్న ఖాళీ పోస్టులు

వసతి పర్యవేక్షణం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 61 బాల, బాలికల వసతి గృహాలున్నాయి. ఇందులో 3162 మంది బాల, బాలికలు ఉంటున్నారు. అదే విధంగా బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 25 ప్రీ మెట్రిక్ వసతి గృహాలుండగా అందులో 1022 మంది, 13 కళాశాల వసతి గృహాలుండగా అందులో 871 మంది విద్యార్థులుంటున్నారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలకు పూర్తి స్థాయిలో వార్డెన్లు లేని దుస్థితి. దీంతో సగానికి పైగా హాస్టళ్లను ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. పూర్తి స్థాయిలో వార్డెన్లు లేకపోవడంతో హాస్టళ్ల పై సరైన పర్యవేక్షణ లేక విద్యార్థులు గాడి తప్పుతున్నారు. వారికి మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అస్తవ్యస్తంగా నిర్వహణ

పూర్తి స్థాయిలో వార్డెన్లు లేకపోవడంతో ఒక్కొక్క వార్డెన్ రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు చూస్తున్నారు. వాస్తవానికి ప్రతి హాస్టల్‌లో వార్డెన్, డిప్యూటీ వార్డెన్, కుక్, సహాయకులు, నైట్ వాచ్ మెన్ ఉండాలి. దగ్గరలో ఉండే పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తుండాలి. కానీ, వార్డెన్లు అరకొరగా ఉండగా...మిగతా సిబ్బంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వార్డెన్లకు రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలను అప్పగించడంతో పూర్తి స్థాయిలో సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. దీంతో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మెనూ అమలు, నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో అడ్మిషన్లు సైతం నామమాత్రంగానే జరిగాయి.

ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం

ప్రస్తుతం జిల్లాలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో ఒక్కో వార్డెన్ కనీసం రెండు వసతి గృహాలైనా బాధ్యతలు చూసుకోవాల్సి వస్తోంది. ఒకదానిలో బాధ్యతలు చూడటమే కష్టంగా మారిన సందర్భంలో రెండు, మూడింటి పర్యవేక్షణ అప్పగించడంతో వారు దేనికీ న్యాయం చేయలేకపోతున్నారు. ఆ ప్రభావం వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థుల చదువులపై ప్రభావం చూపిస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో పరిస్థితి దయనీయంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ కొరవడి చదువులు సవ్యంగా సాగని పరిస్థితి నెలకొంది. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వార్డెన్లు రాత్రి సమయాల్లో ఏ వసతి గృహంలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

నిబంధనలు గాలికి వదిలేసి..

- నిబంధనల ప్రకారం సమీపంలోని వసతి గృహ అధికారికే ఇంచార్జి బాధ్యతలు అప్పగించాలి. లేదా సమీపంలోని ఎస్సీ వసతి గృహ అధికారికీ బాధ్యతలు ఇవ్వొచ్చు. ఎవరూ అందుబాటులో లేకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో దూర ప్రాంతంలోని వారికి ఇంచార్జి బాధ్యతలను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో అలా జరగడం లేదు ఇష్టానుసారంగా ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సస్పెన్షన్‌కు గురై తిరిగి విధుల్లో చేరిన వారికి ఇంచార్జి బాధ్యతలు అప్పగించకూడదు. అయితే కొందరికి నిబంధనలకు విరుద్ధంగా అదనపు బాధ్యతలను అప్పగించారు.
- వసతిగృహ అధికారులు రెగ్యులర్ గా పనిచేస్తున్న చోట ఉదయం, ఇంచార్జిగా వ్యవహరిస్తున్న హాస్టల్ లో సాయంత్రం సమయంలో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఇవేమీ అమలు కావడం లేదు.
- 30 నుంచి 40 కి.మీ దూరంలోని వసతి గృహాలకు ఇంచార్జి బాధ్యతలను ఇవ్వడంతో పర్యవేక్షణ దారి తప్పింది. అంత దూరం ఇంచార్జి వార్డెన్లు వెళ్లలేక అక్కడ పనిచేసే సిబ్బందితోనే హాస్టళ్ల నిర్వహణ భారం మోపి చేతులు దులుపేసుకుంటున్నారు.

జిల్లా సమాచారం

ఎస్సీ బాలుర వసతి గృహాలు	35
ఎస్సీ బాలికల వసతి గృహాలు	26
ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థులు	3,162
బీసీ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు	25
ప్రీ మెట్రిక్ విద్యార్థులు	1022
బీసీ పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు	13
పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులు	871
ఎస్సీ వార్డెన్‌ల కొరత	14
బీసీ వార్డెన్‌ల కొరత	18

ఇష్టారాజ్యంగా సిబ్బంది వ్యవహారం

కూటమి ప్రభుత్వానికి పేద విద్యార్థులంటే అలుసెందుకు? పేద విద్యార్థులు విద్యనభ్యసించే సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధి చేయకుండా అలసత్వం వహించడం దారుణం. జిల్లాలో చాలా వసతి గృహాలకు రెగ్యులర్ వార్డెన్లు లేకపోవడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి. వార్డెన్లు లేని వసతి గృహాల్లో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సక్రమంగా మెనూ సైతం అమలు చేయకుండా అలసత్వం వహిస్తున్నారు.



– ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గజరాజుల బీభత్సం

పులిచెర్ల(కల్లూరు) : పంట పొలాలపై ఏనుగులు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని దిన్నెపాటి దళిత వాడ, బాలిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున ఏనుగులు పంటలను నాశనం చేశాయి. వరుస దాడులతో పంటలను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. సురేంద్రరెడ్డికి చెందిన వరిపంట, రుక్మణమ్మకు చెందిన టమాట పంటలను నాశనం చేశాయి. ఏనుగులు పులిచెర్ల మండలాన్ని వదిలిపోవడం లేదని ఇక్కడే తిష్టవేసి రోజూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వి.కోట : జలపాతంలో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని పోలీ సులు, అగ్ని మాపక సిబ్బంది ఆధ్వర్యంలో వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన మండలంలోని గిడిగి జలపాతం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిన్నాగనపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (45) శనివా రం సాయంత్రం మండలంలోని గిడిగి జలపాతం చూసేందుకు సరదాగా వెళ్లాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు జలపాతంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు ఆదివారం సంఘటన స్థలా నికి చేరుకుని గల్లంతైన శ్రీనివాసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలిసులు తెలిపారు.

అందాల హరివిల్లు



బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో రెండు ఇంద్ర ధనుస్సులు అక్కడి ప్రజలను కనువిందు చేశాయి. ఆ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించుకున్నారు. సాధారణంగా వర్షం కురిసిన తరువాత ఒక ఇంద్ర ధనుస్సు వస్తుందని అయితే రెండు ఇంద్ర ధనుస్సులు ఒకేసారి రావడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఖాకీలు మారినప్పుడల్లా ఇదే సమస్య



దీఈఓ కార్యాలయం వద్ద స్తంభించిన వాహనాలు



ఎంఎస్ఆర్ కూడలి వద్ద రోడ్డుకు అడ్డుగా పెట్టిన బోర్డులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ట్రాఫిక్ నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కొత్త అధికారులు ఎవరు వచ్చారో తెలుసుకోవాలంటే చిత్తూరు–వేలూరు రోడ్డులోని ఎంఎస్ఆర్ కూడలి వద్ద చూస్తే అర్థమైపోతుంది. ట్రాఫిక్ స్టేషన్‌కు ఎవరైనా కొత్తగా వస్తే చాలు.. తొలుత ఎంఎస్ఆర్ కూడలి నుంచి చిత్తూరు నగరంలోకి వచ్చే రోడ్డును మూసేయడం అలవాటుగా మారిపోయింది. కొద్దిరోజుల తరువాత ఇలా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతోందని గ్రహించి, ఆపై రోడ్డుకు అడ్డుగా ఉన్న బోర్డులను తీసేసి.. వాహనాలను అనుమతిస్తారు. ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీపై కొత్తగా అధికారి వచ్చినప్పుడంతా ఇదే పరిస్థితి. కిందిస్థాయి ఉద్యోగులు విషయం చెప్పడం లేదో..? ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన లేకో..? తెలియడంలేదు గానీ.. అధికారుల తీరు వల్ల వాహనచోదకులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుకు అడ్డుగా బోర్డులు పెట్టడం వల్ల వాహనాలన్నీ జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్దకు వెళ్లి యూటర్న్ తీసుకోవాలి. ఇక్కడ రెండు ద్విచక్రవాహనాలు వెళ్తే, వెనుక వైపు ఆటో వెళ్లడం కష్టతరంగా మారుతోంది. ఇక బెంగళూరు–చిత్తూరు వైపునకు వచ్చే వాహనాలు ఇదే మలుపు వద్ద రావడంతో రెండు వైపులా ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో రోడ్లపై వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. చీకటి పడితే దొంగతనంగా గ్రానైట్‌ను లారీల్లో చిత్తూరులోని ఓవర్ బ్రిడ్జిపై తీసుకెళుతున్నా.. పట్టించుకోని పోలీసులు సామాన్యులు తిరిగే రోడ్లను మూసేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కాలువలు లేక.. నీరు ముందుకు కదలక



సీఎంటీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు అర్బన్: నగరంలోని సీఎంటీ రోడ్డులో మురుగు కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే సీఎంటీ రోడ్డులో వర్షపు నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. కాలువలు లేకపోవడం, రోడ్డు ఆక్రమణకు గురవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. నిత్యం ఇటువైపు వందలాది సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. వర్షం పడినప్పుడల్లా నీళ్లు రోడ్లపై, నివాసాల మధ్య నిలిచిపోతోంది. అటు వాహన చోదకులు, పాదచారులతో పాటు స్థానిక ప్రజలకు ఈ పరిస్థితి ఇబ్బందిగా మారింది. పాలకులు పట్టించుకుని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక..దాచేయ్..దోచేయ్ !

- పగలు ఆర్డర్లు .. రాత్రి సరఫరా
- సరిహద్దులు దాటుతున్న ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు



చిన్నకొండామర్రి సమీపంలో డంప్ చేసిన ఇసుకను తరలించడానికి సిద్ధంగా ట్రాక్టర్లు, జేసీబీ

చౌడేపల్లె : కూటమి నేతల అండదండలు.. ఏమి చేసినా అడిగేవారెవరున్నారు? దొరికినంతా దోచేయ్.. మాకు వాటా ఇచ్చేయ్.. అనే చందంగా చౌడేపల్లెలో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. చౌడేపల్లె మండలంలో ఇసుక, ఎర్రమట్టి గ్రావెల్ దందా దర్జాగా ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, చెరువుల్లో మట్టి, ఇసుకను కొల్లగొట్టి సొమ్ము చేసుకొంటున్నా అధికారులెవ్వరూ నోరెత్తకపోవడంతో పలు ఆరోపణలకు తావిస్తోంది. చౌడేపల్లె బోయకొండ మార్గంలోని చిన్నకొండామర్రి సమీపంలో ఓ వ్యాపారి ఏకంగా ఇసుక డంప్ చేసి వ్యాపారం చేస్తున్నా అధికారులు నోరు మెదపడంలేదు. పగలు గ్రామాల్లో ఇసుక అవసరమైన వారి నుంచి ఆర్డర్లు తీసుకొని లోడు ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కందూరు అటవీ ప్రాంతాల్లోని వాగులో నుంచి జేసీబీల సాయంతో ఇసుక లోడ్‌చేసి వారికి అనుకూలమైన రహస్య ప్రాంతాలకు తరలించి ఇసుకను దోచేస్తున్నారు. రాత్రి పూట ఇక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతాలకు ఇసుక టిప్పర్లు రాత్రిపూటే రైట్ చెబుతూ కూటమి నేతలకు అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువుల్లోని మట్టిని ఒకే చోట డంప్ చేయడంతో పాటు ఇసుకతోపాటు అక్రమ వ్యాపారం సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు గోగర్భం డ్యామ్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,275 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మదనపల్లెను జిల్లా చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చందు, అశోక్, వెంకటరమణారెడ్డి

పుంగనూరు : మదనపల్లె పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు పుంగనూరులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం బహుజన సేవా రాష్ట్ర అధ్యక్షుడు చందు, సీపీఐ , ఏఐటీయూసీ, మాల మహానాడు నాయకులు వెంకట రమణారెడ్డి, ఎస్ఆర్.అశోక్ ఆధ్వర్యంలో పలువురు కలసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం హామీని అమ లు చేయాలని , పుంగనూరు, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలను జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అందరితోనూ కలసి పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో గంగరాజు, నరసింహులు, శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, జెవి.నాగరాజు, అజప్ప త దితరులు పాల్గొన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట



ఆలయం వద్ద భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని ఆలయ అర్చకులు ముస్తాబు చేసి చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు ఫలించిన భక్తులు కుటుంబ సమేతంగా హాజరై మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.

గుర్తుకొస్తున్నాయ్..

- 39 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక
- రూ.6 లక్షలతో నిర్మించిన కళావేదిక డైట్‌కు అంకితం



టీటీసీ పూర్వ విద్యార్థులు డైట్‌కు అంకితం చేసిన కళావేదిక, అప్పటి విద్యార్థులు

కార్వేటినగరం : వారంతా కార్వేటినగరం టీటీసీ కళాశాలలో చదువుకున్నారు.. చదువులు పూర్తవ్వగానే ఎవరికి వారే వెళ్లి పోయారు. ఎవరు ఎక్కడ స్థిరపడ్డారో ఎవరికీ తెలియదు. ఎక్కడో ఒకరో ఇద్దరో అప్పుడప్పుడు కలుసుకొని మాట్లాడుకునేవారు. ఇతర మిత్రులను వివరాలను గుర్తు చేసుకునేవారు. ఇంతలో ఒక ఫోన్‌కాల్ టీటీసీ కళాశాల జ్ఞాపకాలను గుర్తు తెచ్చింది. డైట్ కళాశాలలో అప్పటి స్నేహితులతో మళ్లీ కలయికకు శ్రీకారం చుడుతున్నామనే మాటలు వారందరినీ ఒకటి చేశాయి. అనంతపురం, కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల్లో ఎక్కడెక్కడో ఉన్న వారందరనీ ఒకటిగా చేసింది. 39 ఏళ్ల తర్వాత మళ్లీ డైట్‌లో విద్యార్థులుగా మారిపోయారు. కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణా సంస్థలో 1985–86 విద్యాసంవత్సరంలో టీచర్ ట్రైనింగ్ కోర్సు చదివిన విద్యార్థులు ఆదివారం డైట్ కళాశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో వంద మంది విద్యార్థులు కలసి ఒక సంవత్సరం పాటు టీటీసీ చదువుకున్నారు. వీరిని ఒకటి చేయాలనే ఉద్దేశంతో కార్వేటినగరానికి చెందిన ఆ బ్యాచ్ విద్యార్థులు గాజుల నాగేశ్వరరావు, శేఖర్, ఆనంద్, మురుగన్ స్నేహితుల వివరాలను సేకరించి అపూర్వ కలయిక ప్రయత్నంలో విజయం సాధించారు. 39 సంవత్సరాల అనంతరం డైట్ కళాశాలలో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు, వయసు మీరినా ఆట పాటలతో సందడి చేశారు.

చెప్పలేని అనుభూతి

ఎప్పుడు కొట్టుకుంటూ, తిట్టుకుంటూ సరదాగా ఒకరిపై ఒకరు చాడీలు చెప్పుకుంటూ గడిపిన కళాశాల జ్ఞాపకాలను మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నాం. మాజీవన పోరాటం, కుటుంబ ఆరోగ్య విషయాలను ఒకరికొకరు పంచుకున్నాం. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చెప్పలేని అనుభూతికి లోనయ్యాం.



– బి.నరసింహులు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, మదనపల్లి

చాలా సంతోషంగా ఉంది..

ఇది మాజీవితంలో కొత్త అనుభూతి. ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం డైట్ కళాశాలలో టీటీసీ శిక్షణ పొంది ఎవరిదారిలో వారు వెళ్లి పోయారు. ఇలా ఇన్నాళ్ల తరువాత ఒకటి కావడం చాలా సంతోషంగా ఉంది. వయసు మీరి మనవళ్లు, మనరాళ్లతో ఆడుకునే సమయంలో మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉంది.



– గాజుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు, కార్వేటినగరం